## క్లుప్తంగా

### ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో మేయర్ పారిజాతారెడ్డి, కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లోని గ్రీన్ రిచ్ కాలనీలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం మేయర్ చిగురింత పారిజాతారెడ్డి కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కాలనీలో గృహ సముదాయాలు పెరగడంతో ఉన్న ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ మీద లోడ్ అధికం కవడంతో మారో ట్రాన్స్‌ఫార్మర్ అవసరం ఏర్పడిందని అన్నారు. కాలనీవాసులు విజ్ఞప్తి మేరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించి ప్రారంభించామన్నారు. కాలనీవాసులు అవసరాలు తీర్చేందుకే ప్రజా పాలన చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం కాలనీవాసులు మేయర్‌ను సన్మానించారు.

### గర్భిణులకు షోషకాహారం ఇవ్వాలి

మిస్ ఇండియా సుధాజైన్



ప్రిటర్మ్ డెలివరీ బేబీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న 2017 మిస్ఇండియా సుధాజైన్

మన్సూరాబాద్: గర్భిణులకు పోషకాహారంతో కూడిన ఆహారంపై అవగాహన కల్పించాలని 2017 మిస్ ఇండియా, మిస్ పసిఫిక్ సుధాజైన్ అన్నారు. ఎల్‌బీనగర్‌లోని ఆరెంజ్ హాస్పిటల్‌లో ప్రీటర్మ్ డెలివరీ బేబీ మొదటి జన్మదినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఏడు నెలల గర్భిణికి సాహసోపేతంగా శస్త్రచికిత్స నిర్వహించి తల్లిని, బిడ్డను కాపాడిన ఆరంజ్ హాస్పిటల్ వైద్యబృందాన్ని ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ గౌతమ్ గోరిటియాల, ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ రాము, బిజినెస్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రెండు బస్సు సర్వీసులు పునరుద్ధరణ

హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీలవాసులు

మన్సూరాబాద్: కరోనా సమయంలో నిలిచిపోయిన ఆర్టీసీ సేవలు కాలనీవాసుల విజ్ఞప్తిల మేరకు తిరిగి నేడు పునఃప్రారంభమయ్యాయి. మన్సూరాబాద్, నాగోలు డివిజన్ల పరిధిలోని ప్రెస్‌కాలనీ, సౌత్‌ఎండ్ పార్కుకాలనీ, సెవెన్‌హిల్స్ కాలనీ, చండీశ్వరకాలనీ, డీపీనగర్, వీకర్‌సెక్షన్ కాలనీవాసుల పలు మార్లు బండ్లగూడ డిపో మేనేజర్, ఆర్టీసీ ఉన్నతాధికారులకు గతంలో నడిపిన విధంగానే బస్సులను పునరుద్ధరించాలని కోరారు. బండ్లగూడ డిపో మేనేజర్ రమేష్ చొరవతో సౌత్ ఎండ్ పార్కు కాలనీ నుంచి కోఠి మీదుగా సెక్రటేరియట్ వరకు ఒక్క బస్సును, కోఠి మీదుగా సికింద్రాబాద్ వరకు మరొక బస్సును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు విజ్ఞప్తి మేరకు రెండు బస్సులను ప్రారంభించామని, త్వరలోనే మరో మూడు బస్సులను ఈ రూట్ నుంచి నడుపుతామని తెలిపారు. కాలనీలలోని రోడ్లపై అక్రమ పార్కింగ్ చేయకుండా కాలనీవాసులు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఆర్టీసీ సిబ్బందికి సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారి నాగార్జున, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు లింగారెడ్డి, విజయపాల్‌రెడ్డి, రాంబాబు, ఎంవీఎస్ మూర్తి, విజయరాములు, అరుణ్‌కుమార్, కిరణ్‌కుమార్, కిషన్, యాదగిరి యాదవ్, నరేందర్‌రెడ్డి, సుభాష్, రంగారెడ్డి, జంగారెడ్డి, తెలంగాణ వెంకన్న, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

### ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

వనస్థలిపురం: ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణ స్వీకారోత్సవం, ఏకాదశి పర్వదినం సందర్భంగా వనస్థలిపురంలోని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యం ఒక్క మొక్కలు నాటడంతోనే సాధ్యమని దీని కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి రావినూతల శశిధర్, శ్రీ ఎల్లమ్మదేవి ఆలయ చైర్మన్ వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, శ్రీ మహంకాళి దేవాలయ చైర్మన్ నీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్, శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం చైర్మన్ మఠం శాంతకుమార్, గాండ్ల సీనయ్య, బొమ్మి నరేందర్, సత్యమూర్తి, సురేష్, వీరేశ లింగం తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: రావిర్యాల ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మహేశ్వరం: మన్సాన్‌పల్లి గ్రామంలో..



మహేశ్వరం: నాగారంలో ఈద్గా వద్ద..

# భక్తిప్రపత్తులతో ఈదుల్ అజ్ హా

## ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు

మహేశ్వరం: మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్(ఈదుల్ అజ్ హా) పండుగను పురస్కరించుకొని సోమవారం ముస్లింలు మసీదులు, ఈద్గా, దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలో జామై మసీదు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఈద్గా, దర్గా వద్దకు వెళ్లి పూలు, చద్దరులు కప్పారు. హిందూముస్లింల ఐక్యతకు బక్రీద్ పండుగ నిదర్శనమని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఎంఏ.సమీర్, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అదిల్ అలీ, మండల మైనార్టీ సంఘం అధ్యక్షుడు ఎంఏ.ఫరీద్ పేర్కొన్నారు. త్యాగానికి ప్రతీక అన్నారు. ప్రజలంత సుఖ శాంతులతో ఉండాలని వేడుకున్నారు. పేదలకు గొర్రె పొట్టేలు మాంసం పంపిణీ చేశారు. మండల కేంద్రంలో మసీదు, దర్గాకు ప్రజాప్రతినిధులు వెళ్లి ముస్లింలను కలిసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు వెంకట్‌రెడ్డి, రవీందర్, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**పలు గ్రామాల్లో..**

మండల పరిధిలోని మన్సాన్‌పల్లి, నాగారం, నందుపల్లి, దుబ్బచర్ల, అమీర్‌పేట్, చిన్న తూప్రకుర్దు, తుమ్మలూరు పలు గ్రామాల్లో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు మాంసం, దుస్తులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకులు ఎండీ.నసీర్‌ఖాన్, నాగారం మాజీ ఉప సర్పంచ్ ఎంఏ.లతీఫ్‌ఖాన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని పెంచుకోవాలని కోరారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలను ముస్లిం మత పెద్దలు సీఐ, ఎస్‌ఐలను ఘనంగా పూలు, శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో నాగారం మాజీ సర్పంచ్ దశరథ, బీఆర్‌ఎస్ నాయకులు లింగం ముదిరాజ్, బాబు జానీ, కమాల్‌ఖాన్, బిస్మిల్లాఖాన్, నయింఖాన్, చాన్‌పాషా, ఘనీఖాన్, అహ్మద్‌ఖాన్, అఫ్రోజ్‌ఖాన్, తాహేర్, జాబేర్ తదితరులు పాల్గొన్నారు.

**ఆలింగనం చేసుకొని..**

కందుకూరు: మండల పరిధిలో బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నా, పెద్దా అంతా ఉదయమే ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఖుర్బానీని బంధువులు, స్నేహితులకు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో మత పెద్దలు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: నేదునూరులో..



కందుకూరు: కొత్తగూడలో ప్రార్థనల అనంతరం ముస్లింలు



మహేశ్వరం: మండల కేంద్రంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

### సంఘం రిజిస్ట్రేషన్‌కు వివరాల సేకరణ

వనస్థలిపురం: వనస్థలిపురం, పరిసర ప్రాంతాలలో నివాసం ఉండే మున్నూరు కాపులకు సంబంధించి సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయడానికి మున్నూరు కాపులు అందరు తమ వివరాలు అందజేయాలని సంఘం ప్రతినిధులు మర్రెట్టి నరసింహారాజు, ఆవుల వంశీకృష్ణ, పత్తి రాజు ఒక ప్రకటనలో కోరారు. అందరి వివరాలు వచ్చిన తర్వాత అందరి సహకారంతో నూతనంగా సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయిస్తామని వారు తెలిపారు. వివరాలకు ఫోన్: 7680828291, 9441439045, 9246064452లను సంప్రదించాలని వారు సూచించారు.

### కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారులలో కూరగాయల ధరలు (కిలో..రూపాయల్లో) ఈ విధంగా ఉన్నాయి. టమాట 47, వంకాయ 28, బెండ 55, పచ్చిమిర్చి 80, కాకర 60, బీర 72, క్యాబేజి 23, ఫ్రెంచి బీన్స్ 145, క్యారెట్ 45, దొండ 43–45, చిక్కుడు 65, గోకర 55, బీట్‌రూట్ 23, క్యాప్సికం 68, ఆలు 35, దోస 23, సొర 17, పొట్ల 20, ఉల్లిగడ్డ 39, చామగడ్డ 40లుగా ఉన్నాయని మార్కెట్ అధికారులు తెలిపారు. కాగా ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

### ఖేల్ ఇండియా పోటీలకు ఎంపిక

హస్తినాపురం: కర్ణాటక రాష్ట్రంలోని బాగాల్కోట్‌లో జరిగిన సౌత్‌జోన్ ఖేల్ ఇండియా పురుషులు, ఉమెన్స్ పోటీలలో హస్తినాపురం భవిష్య స్కూలు విద్యార్థులు పాల్గొని వివిధ పతకాలు సాధించి జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ విభాగంలో రావుల మోక్ష వెండి పతకంతోపాటు మూడువేల రూపాయల నగదు, గుద్దేటి వైష్ణవి కాంస్య పతకం, రెండువేల నగదు, జరుపుల సిరి చందన కాంస్య పతకం, రెండువేల రూపాయల నగదు బహుమతి సాధించినట్లు భవిష్య స్కూలు చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, స్కూలు ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను వారు అభినందించారు.

# జోరు వర్షానికి కూలిన చెట్లు



బడంగ్‌పేట్: కుర్మల్‌గూడలో కూలిన చెట్టును తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

బడంగ్‌పేట్: వర్ష బీభత్సం స్థానికంగా అలజడి సృష్టించింది. సోమవారం కురిసిన వానకు బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని పలు చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. రహదారులన్నీ జలమయం అయ్యాయి. ఎక్కడికక్కడ రవాణావ్యవస్థ స్తంభించిపోయింది. నాలాలు పొంగుతున్నాయి. దీంతో కార్పొరేషన్ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.



బడంగ్‌పేట్: అల్మాస్‌గూడలో నేలకొరిగిన వృక్షాన్ని జేసీబీతో తొలగింపు

### ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

తుర్కయంజాల్: టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. తనకు టెస్కాబ్ వైస్ చైర్మన్ పదవి రావడానికి సహకరించినా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకులు అశోక్‌గౌడ్, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం

ఇబ్రహీంపట్నం: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిపో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తమ సలహాలు, సూచనలు, సమస్యలు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్టీసీ డిపో అభివృద్ధికి సహకరించాలని విన్నవించారు.



### ఎమ్మెల్సీకి సన్మానం

కొత్తూరు: ఇటీవల మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డిని సోమ వారం మున్సిపాలిటీ కౌన్సిలర్ మాదారం నర్సింలుగౌడ్ ఆయన స్వగ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నర్సింలుగౌడ్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ వస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తమకు సూచించినట్లు తెలిపారు. ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయ మన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో చాలావరకు ఆదరణ తగ్గిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమని కౌన్సిలర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నర్సింహా పాల్గొన్నారు.

# వారం రోజుల నుంచి రాత్రిపూట గస్తీ

**ధార్ ముఠా ప్రచారంతో బెంబేలెత్తున్న శివారువాసులు**

వనస్థలిపురం: ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ధార్ ముఠా దోపిడీలు చేసేందుకు నగర శివారు ప్రాంతాల్లో సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తుండడంతో శివారు కాలనీల ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. ఇప్పటికే పలు కాలనీలలో చైన్‌స్నాచింగ్‌లు కొనసాగుతుండగా ఇప్పుడు ప్రాణాలు తీయడానికి సైతం వెనుకాడని ముఠాలు ఇళ్లల్లోకి చొరబడే అవకాశాలు ఉన్నాయని వస్తున్న వార్తలతో పలు కాలనీల ప్రజలు బెంబేలెత్తు తున్నారు. కొత్తగా వెలుస్తున్న పలు కాలనీలలో ఇంకా సీసీ కెమెరాలు ఏర్పాటు కాకపోవడం, మీరే గస్తీ ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు పేర్కొంటున్న నేపథ్యంలో కాలనీలలోని యువకులు రాత్రిపూట మేలుకుని గస్తీ నిర్వహిస్తున్నారు.

**బృందావన్ మెడోస్ కాలనీలో...**

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ మెడోస్ కాలనీలో కాలనీకి చెందిన యువకులు గత వారం రోజులుగా ఒక బృందంగా ఏర్పడి గస్తీ నిర్వహిస్తున్నారు. కాలనీలో సీసీ కెమెరాలు ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో పోలీసుల సూచనల మేరకు స్వీయరక్షణ కోసం రాత్రివేళ తాము మేల్కొని గస్తీ తిరుగుతున్నామని యువకులు శశి, వెంకట్, కైలాష్, జగన్, సురేందర్, హరినాథ్‌బాబు, ప్రభాకర్ తెలిపారు. పోలీసులు కూడా రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని వారు తెలిపారు.



బృందావన్ మెడోస్ కాలనీలో కర్రలతో గస్తీ నిర్వహిస్తున్న యువకులు

# పంపిణీకి ముహూర్తమెప్పుడు?

- నెలల తరబడి మున్సిపల్ కార్యాలయంలోనే దుస్తులు
- అందజేయాలని కార్మికుల డిమాండ్

మీర్‌పేట: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు మీర్‌పేట కార్పొరేషన్‌లో పని చేసే కార్మికుల పరిస్థితి దాపురించింది. నూతన దుస్తులు సిద్ధంగా ఉన్నా.. పంపిణీకి మాత్రం ముహూర్తం కుదరడం లేదు.. కుట్టించి సంవత్సరం అవుతుండగా.. తెప్పించి నెలలు గడుస్తున్నా సిబ్బందికి ఇవ్వడానికి సమయం మాత్రం లేదేమో..!

**ఎన్నికల కోడ్ ఉందంటూ..**

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటేషన్, వాటర్‌మెన్‌లు కలుపుకొని దాదాపు 129 మంది వరకు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది కోసం ఏడాదిన్నర కింద కార్పొరేషన్ అధికారులు కొలతలు తీసుకుని నూతన దుస్తులను(యూనిఫాం) కుట్టించారు. ఆ తరువాత దుస్తులకు సంబంధించిన బిల్లు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ ససేమిరా అనడంతో అవి అక్కడే ఉండిపోయాయి. సిబ్బంది ఒత్తిడితో ఎట్టకేలకు అధికారులు రెండు నెలల క్రితం దుస్తులను తీసుకొచ్చి కార్యాలయంలో ఉంచారు. ఇకనైనా దుస్తులు తమకు ఇస్తారనుకుంటే ఎన్నికల కోడ్ ఉందంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు వాయిదా వేసినట్లు సిబ్బంది చెప్పారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసి రోజులు గడుస్తున్నా అధికారులు ఆ ఊసే ఎత్తడం లేదని సిబ్బంది వాపోతున్నారు. దుస్తులు కుట్టించి సంవత్సరం అవుతున్నా అందజేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మున్సిపల్ సిబ్బంది ఆరోపిస్తున్నారు.



మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

**త్వరలోనే అందజేస్తాం**



మున్సిపల్ సిబ్బందికి నూతన దుస్తులను అందజేయాలని ఇప్పటికే కార్పొరేషన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. రెండ్రోజుల్లోగా కార్మికులందరికీ దుస్తులు పంపిణీ చేస్తాం.

– ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, మేయర్, మీర్‌పేట

# ఘనంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు

## ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని సౌభాగ్యపురం కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సబితారెడ్డిని శాలువతో సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సౌభాగ్యపురం కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, సుధాకర్‌గుప్తా, నర్సింహారెడ్డి, మూర్తి, మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నెలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, వెంకటేష్ గౌడ్, జై శ్రీమన్నారాయణ, మహేందర్ రెడ్డి, శ్యాంగుప్తా, శ్రీనివాస్, రమేష్‌కురమ, ఆర్‌కేపురం డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఊర్మిళ, స్వప్న పాల్గొన్నారు.



పూజా కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే సబితారెడ్డితో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు